క్లుప్తంగా

ఘనంగా గాధాలమ్మ అమ్మవారి జాతర



పరవాడ: తానాం గ్రామంలో కొలువుదీరిన శ్రీ గాధాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని గ్రామ రజకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పండగలో పాల్గొన్న పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు తన అనుచర వర్గంతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో తానాం రజక నాయకులు పాల్గొన్నారు. అలాగే గాధాలమ్మ అమ్మవారిని తానాం సర్పంచ్ కన్నూరు దేవి వెంకట రమణ, పరవాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యుడు పైల కృష్ణ, రొంగలి అప్పారావు (ఎల్‌ఐసీ), డీఎంఎల్ నాయుడు, అందూరి శంకర్, అప్పారావు, రాజు, శ్రీను తదితరులు దర్శించుకున్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: పాఠశాలలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో గురువారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. పలు అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. వార్డెన్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై ఫిర్యాదు



పవన్‌కుమార్



శ్రీను

పెందుర్తి: చినముషిడివాడ వుడా కాలనీకి చెందిన పవన్‌కుమార్‌శర్మ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు అతడి భార్య నీరజాశర్మ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 10న ఇంటి నుంచి బయటికి వెళ్లిన పవన్‌కుమార్‌శర్మ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో నీరజ పోలీసులను ఆశ్రయించింది.

- పెందుర్తి సావిత్రినగర్‌కు చెందిన ఉప్పలపాటి శ్రీను గత డిసెంబర్ 14న ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. ఎంతకీ అతడు తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు ఉప్పలపాటి వర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి. సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసులు దర్యాప్తు జరుగుతున్నాయి.

రహదారి ఆక్రమణతో ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్ జామ్ వల్ల వెనుదిరుగుతున్న వాహన చోదకులు

సీతంపేట : రామాటాకీస్ సమీప శ్రీనగర్‌లో రెడ్డి హాస్పిటల్ రోడ్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డుకి రెండు వైపులా ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రహదారి ఇరుకుగా మారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలులేక తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రామాటాకీస్ రోడ్ నుంచి వీటీ స్కూల్ మీదుగా ద్వారకానగర్ వెళ్లడానికి అనువైన రహదారి కావడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి వాహనాల పార్కింగ్‌ను నియంత్రించి వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేలా మార్గం సుగమం చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల అందజేత

అక్కిరెడ్డిపాలెం: కొద్ది రోజుల క్రితం జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 90 మందికి కళ్ల అద్దాలు అవసరమయ్యాయి. గురువారం ఆ 90 మంది విద్యార్థులకు సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) ఆర్.శ్రీనివాసరావు కళ్ల అద్దాలు అందజేశారు. అలాగే కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో స్కూల్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ భవన నిర్మాణానికి సంస్థ అధికారులు, స్కూల్ హెచ్‌ఎం ఆంజనేయతో కలిసి భూమి పూజ చేశారు. కోరమండల్ ఏజీఎం (ఈహెచ్‌ఎస్) నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుణాలు



రాళ్లు తేలిన మెట్టపాలెం -పాతరాజన్నపాలెం రోడ్డు



ధ్వంసమైన వెంకటాపురం రహదారి



అధ్వానంగా మారిన బొట్టవానిపాలెం-ఎన్టీపీసీ మెటల్ రోడ్డు

పరవాడ: అధ్వానంగా మారిన గ్రామీణ రహదారులను పట్టించుకునే నాథుడు లేక ఏళ్ల తరబడి రాళ్లు తేలిన రోడ్లతో అష్టకష్టాలు పడుతున్నామని నాయుడుపాలెం శివారు మెట్టపాలెం, వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం ప్రజలు వాపోతున్నారు. మెట్టపాలెం-పాతరాజన్నపాలెం గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు అధ్వానంగా మారి సుమారు పదేళ్లు కావస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు. మెట్టపాలెం-పాతరాజన్నపాలెం గ్రామాల మధ్య సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి తుపాన్లు, భారీ వర్షాల ధాటికి శిథిలమై రాళ్లు తేలిపోయింది. భారీ గుంతలతో నిండిన రోడ్డులో రాకపోకలు సాగించాలంటే పాదచారులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. తాము పండించిన కూరగాయలను పట్టణ ప్రాంతాలకు తీసుకెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని, ఏ మాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు నిలిచిపోవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని కూరగాయల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యార్థులు, కార్మికులు, రైతు కూలీలు ఈ దారిలో ప్రయాణం అంటే బెంబేలెత్తిపోతున్నారు. రాళ్లు తేలిన రోడ్డుకు రిపేర్లు చేపట్టాలని అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదని ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని వైనం..

వాడచీపురుపల్లి, వెంకటాపురం గ్రామాల మధ్య రహదారి గత కొన్నేళ్లుగా పూర్తి స్థాయి మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నా కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకం పోవడంతో వెంకటాపురం, నునపర్తి, రేకవానిపాలెం, గొల్లగుంట గ్రామాలకు చెందిన ప్రజలు నరకయాతన పడుతున్నారు. వాడచీపురుపల్లి నుంచి మూడు కిలోమీటర్ల నిడివి కలిగిన రహదారి పూర్తి స్థాయిలో దెబ్బతింది. రోడ్డు ధ్వంసమై రాళ్లు తేలి భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాడచీపురుపల్లిలోని బ్యాంకు పనులు, వ్యాపార లావాదేవీలు జరపడానికి పైన పేర్కొన్న గ్రామాల నుంచి నిత్యం అనేక మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రాళ్లు తేలిన రహదారిలో వాహనాలపై రాకపోకలు సాగించడం ద్వారా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి..

రావాడ శివారు బొట్టవానిపాలెం-ఎన్టీపీసీ మధ్య నిర్మించిన మెటల్ రోడ్డు అధ్వానంగా మారడంతో బొట్టవానిపాలెం, రేకవానిపాలెం, గొల్లగుంట, ధర్మారాయుడుపేట గ్రామాల ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం బొట్టవానిపాలెం-ఎన్టీపీసీ మధ్య నిర్మించిన మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో రాళ్లు తేలిన రహదారితో అష్టకష్టాలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఏ మాత్రం వర్షం కురిసినా మెటల్ రోడ్డు బురదమయంగా మారుతుందని, పంటలు ఇళ్లకు చేర్చుకోవడం కష్టంగా ఉందంటుందని రైతులు చెబుతున్నారు. ఎన్టీపీసీలో పని చేస్తున్న ఆయా గ్రామాలకు చెందిన కార్మికులు రహదారి అధ్వానంగా మారిన నేపథ్యంలో అదనంగా 5 కిలోమీటర్లు ప్రయాణం సాగించి ఎన్టీపీసీలో విధులకు హాజరు కావలసి వస్తుందంటున్నారు. రాళ్లు తేలిన మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడం ద్వారా రైతులు, కార్మికులు, ప్రజలకు అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని కోరుతున్నారు.

శిథిల రోడ్డుతో అవస్థలు పడుతున్నాం..



గుంతలమయంగా మారిన మెట్టపాలెం-పాతరాజన్నపాలెం బీటీ రోడ్డుతో నానా అవస్థలు పడుతున్నాం. ఈ రోడ్డుకు ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు చేపట్టలేదు. చీకటి పడితే రోడ్డుపై భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. గుంతల రోడ్డుతో ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ రహదారికి మరమ్మతులు చేయాలి.

– కన్నూరి అయ్యబాబు, మెట్టపాలెం

ప్రయాణం నరకం..



వాడచీపురుపల్లి-వెంకటాపురం రహదారిలో ప్రయాణం నరకం. ఇక్కడ అడుగుకో గుంత, ఆపై రాళ్లు తేలిన రోడ్డులో వాహనాలతో రాకపోకలు సాగించడానికి భయపడుతున్నాం. వాహనాల టైర్లకు రాళ్లు గుచ్చుకుని తరచూ పంక్చర్లు అవుతున్నాయి. రోడ్డును బాగు చేయాలని కోరినా అధికారులు స్పందించలేదు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

– షేక్ అలీ, గొల్లగుంట

కాలినడకన కూడా వెళ్లలేకపోతున్నాం..



బొట్టవానిపాలెం-ఎన్టీపీసీ మధ్య ఏళ్ల క్రితం నిర్మించిన మెటల్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలి. వర్షా కాలంలో మెటల్ రోడ్డు బురదమయంగా మారిపోతుంది. ఆ సమయంలో కాలినడక కూడా కష్టమవుతోంది. రోడ్డు బాగు లేక ఎన్టీపీసీలో పని చేస్తున్న కార్మికులు మరింత దూరం ప్రయాణించి విధులకు వెళ్లవలసి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కావలి వాసు, రావాడ

ఆర్చరీలో ప్రతిభ చాటిన గణేష్‌కు అభినందన



కాంస్య పతకం సాధించిన గణేష్ మణిరత్నం

పరవాడ: ఉత్తరాఖండ్‌లో ఇటీవల జరిగిన 38వ జాతీయ క్రీడల్లో అద్భుత విజయం సాధించిన విశాఖ జిల్లా ఆర్చర్ తిరుమూరు గణేష్ మణిరత్నంను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మణిరత్నం కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో కాంస్య పతకం, కానో స్లాలోమ్ ఉమెన్స్ (కె-1) మిక్స్‌డ్ కాంపౌండ్ ఈవెంట్‌లో రజత పతకం కైవశం చేసుకున్న సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి నిశాంత్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి భాస్కర్, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, వైజాగ్ ప్రొఫైల్స్ అధినేత వి.కృష్ణారావు, వి.కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

తాగునీటికి అంతరాయం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ జోన్-8 పరిధిలో 7,8 తేదీల్లో తాగునీటికి అంతరాయం కలగనున్నట్లు మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు బి.మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ పంపు హౌస్ మరమ్మతుల్లో భాగంగా ఈ అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. జీవీఎంసీ జోన్-8 పరిధిలోని 93 నుంచి 98 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో 7, 8వ తేదీల్లో ఉదయం 10 నుంచి మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా భూలోకమాంబ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్, పీతల అప్పలరాజు



పసుపు నీళ్లతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలో కొలువుదీరిన భూలోకమాంబ నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 7 నుంచి వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. అప్పన్నపాలెం, సింహపురి కాలనీ, బాలాజీ హిల్స్, సింహపురి లేఅవుట్, జేఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీ, బాలాజీ హిల్ వ్యూ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల నుంచి మహిళలు తమ ఇళ్ల నుంచి బిందెలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి తిరువీధిలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి ఆలయం వద్ద వినాయక పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశనం,యాగశాల పూజ ప్రవేశం, అఖండ దీప స్థాపనం, ధ్వజ పతాకప్రతిష్ట, మృత్సంగ్రహణం, అంకురారోపణం, అమ్మవారి విగ్రహానికి, యంత్ర శిఖరానికి జలాధివాసం, క్షీరాభివాసం, అగ్నిప్రతిష్ట, హోమాలను ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పీతల విష్ణుమూర్తి, పళ్ల వెంకటరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా వల్లీ కల్యాణం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



అభిషేకం చేస్తున్న స్వాత్మానందేంద్ర

పెందుర్తి: చినముషిడివాడలోని శారదా పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా 4వ రోజు గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా గోపూజ చేశారు. దక్షిణామూర్తికి పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్ఛరణ నడుమ వల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం చేశారు. సాయంత్రం శారదా పీఠం నుంచి పెందుర్తి పోలీస్ స్టేషన్ మీదుగా చినముషిడివాడ పురవీధుల్లో శోభాయాత్ర కొనసాగింది.

కోలాటాలు, తప్పెటగుళ్లు, గిరిజన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. శుక్రవారం మహాపూర్ణాహుతితో వార్షికోత్సవాలు ముగుస్తాయని పీఠం ప్రతినిధులు వెల్లడించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమని చెప్పి లోన్ మంజూరు చేస్తామని, రుణ మాఫీ వస్తుందని, కేవైసీ అప్‌డేట్ చేయాలని తెలియని లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని తెలిపారు. మన తప్పిదాల వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా విభూతి బ్రదర్స్ వారిచే కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌బీఐ మేనేజర్ దాసరి రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఆఖిల్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

విశాఖ విద్య: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బంగ్లాదేశ్ విద్యార్థిని శేసోటి నాగ్ కుటుంబ సభ్యులను ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు పరామర్శించారు. గురువారం ఏయూకు వచ్చిన విద్యార్థి తల్లిదండ్రులను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం విద్యార్థిని చిత్రపటానికి అంజలి ఘటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిభ వంతురాలైన విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో కోల్పోవడం తమకు ఆవేదన కలిగించిందన్నారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య ఎన్.ఎం.యుగంధర్, ఆచార్య రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అప్పన్న కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఒడిశాలోని చికిడి గ్రామంలో గురువారం ఉదయం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఒడిశాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా చికిడి గ్రామంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రచార రథంలో ఉత్సవమూర్తులకు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఒడిశా భక్తులు కనులారా ఈ వైభవాన్ని వీక్షించారు. గ్రామంలో రథోత్సవం నిర్వహించారు.

దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చిన్నా, రఘునాథ్, పవన్ తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా ఒడిశాలోని ఈనెల 2 నుంచి ప్రారంభమైన దేవస్థానం ప్రచార రథం పర్యటన గురువారంతో పూర్తయింది. దీంతో సింహాచలం దేవస్థానానికి రథం తిరుగు పయనమైంది.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30 నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం,మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఐటీఐలో టెక్ కార్నర్ ఏర్పాటు



ఐటీఐకి మహేంద్ర సంస్థ అందించిన సామగ్రి

కంచరపాలెం : కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ (ఓల్డ్)లో టెక్ కార్నర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ మేరకు ఐటీఐలోని డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రికల్ ట్రేడ్‌ల విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో విద్య అందించాలన్న ఉద్దేశంతో మహేంద్ర అండ్ మహేంద్ర సంస్థ సహకారంతో సెంటర్ ఫౌండేషన్ టెక్ కార్నర్‌ని రూపొందించినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ నుంచి ఆన్‌లైన్ క్లాసులు వినవచ్చని సెంటర్ ఫౌండేషన్ ప్రతినిధి నవీన్ తెలిపారు. ఈ కంపెనీ ఐటీఐ విద్యార్థుల ట్రైనింగ్ కోసం స్మార్ట్ టీవీ, అత్యాధునిక టూల్ కిట్ అందజేసినట్లు తెలిపారు. సంస్థ అందిస్తున్న సేవలను ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, ట్రైనింగ్ ఆఫీసర్ జె.సత్యనారాయణ, అధ్యాపకులు వి.శ్రీనివాసరావు, ట్రైనర్ జె.బాలమురళి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్ పేపర్‌లో మురీమిక్చర్ విక్రయం హానికరం



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఆహార భద్రత అధికారులు

ఏయూక్యాంపస్: ప్రింటింగ్ న్యూస్ పేపర్‌ను ఆహార పదార్థాల విక్రయానికి వినియోగించరాదని జీవీఎంసీ ఆహార భద్రత అధికారులు సూచించారు. ఆహార నాణ్యత, భద్రతపై బీచ్ రోడ్డులో చిరు వ్యాపారులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి.ఏ.బి నందాజీ మాట్లాడారు. మురీ మిక్చర్ అమ్మే వ్యాపారులు న్యూస్‌పేపర్‌లో పెట్టి అమ్మడం వలన వినియోగదారులకు క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిని పూర్తిగా నిలిపివేయాలని, ఎఫ్ఎస్ఐ నిర్ధారించిన పేపర్ ప్లేట్స్ మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఎక్కువ సమయం నిల్వ ఉంచిన పదార్థాలను విక్రయించరాదని, తాజాగా ఉండే ఆహారాన్ని మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. వినియోగదారులతో గౌరవంగా ప్రవర్తిస్తూ, నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఆహార అధికారి జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై ప్రభుత్వాల వివక్ష



దీక్ష శిబిరంలో సిటు నాయకులు

కూర్మన్నపాలెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారంపై వివక్ష చూపుతున్నాయని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. రామారావు ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ పోరాట సమితి కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో గురువారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆందోళకారులను ఉద్దేశించి మాట్లాడుతూ కర్మాగారం విషయంలో కేంద్ర మంత్రులే పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. శిబిరంలో సిటు నాయకులు కె.గంగాధర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 వరకు ఇంటింటికీ పశువైద్య సేవలు



డాక్టర్ రామకృష్ణ

ఆరిలోవ : జిల్లా పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 వరకు ఇంటింటికీ పశు వైద్య సేవలు అందించనున్నారు. గత నెల 20 నుంచి 31 వరకు జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిబిరాలలో వైద్య సేవలు అందించగా జిల్లాలో మిగిలిన పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలకు నాలుగు రోజులుగా ఇంటింటికీ వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 15 వరకు ఈ సేవలు అందించి 100 శాతం పశువులకు వైద్యం అందించడం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఉచిత వైద్య శిబిరాలతో జిల్లాలో 60 శాతం పశువులకు సేవలు అందించామన్నారు. 12,222 ఆవులు, గేదెలకు, 9,625 గొర్రెలు, మేకలకు, 16,052 కోళ్లకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. 37,145 గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ మందులు వేసినట్లు వివరించారు. ఇంకా మరో 40 శాతం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు మిగిలిపోయినట్లు తెలిపారు. ఆయా రైతులు గత నెలలో నిర్వహించిన వైద్య శిబిరాలకు అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు పశు వైద్య సిబ్బంది నాలుగు రోజులుగా గ్రామాల్లో వాళ్ల ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పెద్ద పశువులు, దూడలకు నట్టల నివారణ టీకాలు, మేకలు, గొర్రెలకు ఫాక్స్ టీకాలు, కోళ్లకు కునుకుడు వ్యాధి రాకుండా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15కి జిల్లాలో 100 శాతం పశువులకు ఉచిత వైద్యం అందించడం పూర్తి చేస్తామన్నారు.